# స్త్రీ ★ ★ ★

కథకుడు:
రావు వెంకటరంగనాయకులు

"సరోజ్!"

"ఎవరు?"

నేను "రమేశ్" ని

ఆ, వస్తున్నా అంటూ తలుపుతీసి సరోజ్ నవ్వుతూ రమేశ్ చేతుల్లోంచి పుస్తకాల కట్ట లాక్కుని పదండి పైకిఅంది.

మీ అమ్మ ఎక్కడుంది అంటూ రమేశ్ మేడ మీద ఓకుర్చీలో కూలబడ్డాడు.

మాలతి (సరోజ్ తల్లి) వంటింట్లోంచి వస్తూ అంది—ఓహో! నువ్వా? రమేశ్! ఏమిటి విశేషాలు! సరోజ్! రమేశ్ కి 'టీ' తీసుకురా. సరోజ్ 'టీ' తీసుకువచ్చి రమేశ్ చేతి కందించింది.

మాలతి అప్పుడు వంటింట్లోకిపోయింది.

ఇద్దరూ ఏకాంతంగా మాట్లాడుకో మొదలెట్టారు.

సరోజ్! ఏమిటి విశేషాలు!

విశేషాల కేమున్నాయి, మీరిక్కడికి రావడమే ఒక గొప్ప విశేషం.

ఏం, అలా అంటావేం?

మీరు మూడు సంవత్సరాలు విదేశంపోయి ఏదో చదువుకుంటారటగా అంది ఏడుస్తూ సరోజ్.

ఏం, ఏడుస్తావెందుకు?; అవును మూడు సంవత్సరాలు చదవాలిమరి!

మూడు సంవత్సరాలే! అబ్బా! ఇన్ని రోజులు యెలా గడుస్తాయిబాబూ!

ఆ, గడవడానికేముంది; కాలంయిట్టేతోసుకు వచ్చేస్తుంది, నువ్విలా కంగారుపడ్తే నా చదువు సాగినట్టే! అంటూ రమేశ్ కూడా కంట తడి బెట్టాడు.

"అయితే యివాళే వెళ్తావా?

అవును, నాన్నగారి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. వెళ్లాలి. నువ్విలాదుఃఖిస్తూ కూర్చుంటే యెలా? ధైర్యం చిక్కబట్టాలి. మూడు సంవత్సరాలేగా! కళ్లు మూసుకుంటే గడచిపోతాయి.

సరేగాని ఉత్తరాలు రాస్తుంటావా మరి! అంటూ కన్నీరుకారుస్తూఅంది సరోజ్.

రాస్తుంటా; రోజూ ఓ ఉత్తరం రాస్తుంటా కాని నువ్వు నీ చదువుమాత్రం మానకు. బాగా ధ్యానముంచి చదవాలి. నువ్వూ ఉత్తరాలు వ్రాస్తూ వుండు.

ఆలాగే, భోజనానికిపద.

మాలతి భోజనపుపళ్లెం ముందుపెడ్తూ విసనకఱ్ఱతో విసరుతూ అంది—

సరోజ్ జీవితమంతా నీ చేతిలో వుంది రమేశ్!

ఆలాగే, నేను విదేశంనుంచి తిరిగివచ్చాక సరోజ్ ని తప్పక పెళ్లిచేసుకుంటాను. సరోజ్ చదువు ఆపకండేం!

మాలతిఅంది—నా శక్తికొలదీ చదివిస్తా.

కొంచెం సంకోచించి రమేశ్ అన్నాడు—నావద్ద కొన్ని రూపాయలున్నాయి అవి అవసరం వచ్చినప్పుడు వాడుకోండి; ఇవిగో ఉంచండి.

ఎందుకు నాయనా! అక్కర్లేదులే! నీ సహాయం మాకు ఎప్పుడూ ఉన్నదేగా? నావద్ద కొన్ని నగలున్నాయి. అవసరంవస్తే అవి పనికివస్తాయిలే.

రమేశ్ తల వంచేసుకున్నాడు.

నాయనా! అన్నిటికీ నువ్వేఉన్నావ్,ఏలాగో సరోజ్ ని రక్షించేభారం నీది, ఏమో! నేనీలోపల చస్తానో బ్రతుకుతానో!

అలా ఎన్నడూ అనుకోవద్దు; ఇదిగో ఈ భోజనపు పళ్ళెంతోడు, సరోజ్ ని తప్పించి ఇంకో కళ్లని పెళ్లిచేసుకోను.

సరోజ్, మాలతిలవద్ద సెలవుతీసుకునిరమేశ్ వెళ్లిపోయాడు. రాత్రి నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ

ట్రయిన్ ద్రుతవేగంతో వెళ్లిపోతోంది. రమేశ్ యెదుట సరోజ్ యొక్క ఆదీనవదనం ప్రత్యక్షమవుతోంది. ఇంతక్రితం ఆమె యెవతో నే నెవడ్నో! ఇంతలోనే యింత......................

సరోజ్, రమేశులు చిన్ననాటి బాల్యస్నేహితులేగాక మేనత్త మేనమామబిడ్డలు. అనుదినం కలసిమెలసి ఉండేవారు. ఒక కంచానతిని ఒక మంచాన పడుకునేవారు. సరోజ్ కి అతి చనువైపోయినందున రమేశ్ అంటే సరోజ్ కి అమితమగు ప్రేమ! రమేశ్ కి కూడా అంతే!

సరోజ్ ఏడవఫారం చదువుతోంది. ఈమధ్య తల్లికి జబ్బు చేసినందువల్ల చదువుకి కొంత అంతరాయం కలిగింది.

సరోజ్ ని పెళ్లి చేసుకోమని మాలతి రమేశ్ ని అనేకసార్లు అడిగింది. ఎప్పుడూ రమేశ్ నిరాకరించలేదు.

సరోజ్ నాదేఅని రమేశ్ అనుకుంటున్నాడు. రమేశ్ నావాడేఅని సరోజ్ అనుకుంటోంది.

* * *

తనకి వివాహం కానున్నదని ప్రయాగవచ్చాక రమేశ్ విన్నాడు. వివాహం నిశ్చయమైంది యీ నెల్లోనే.

బాగా ఆలోచించినమీదట తల్లితో అన్నాడు- అమ్మా! నేను పెళ్లి చేసుకోను.

తల్లి ఆశ్చర్యంతో అంది—ఏమి నాయనా! పెళ్లి యెందుకు చేసుకోవు?

అప్పుడే తొందరేముందమ్మా, తిరిగి వచ్చాక చూచుకోవచ్చులే.

ఏమిటి అలాఅంటావేం. మీ నాన్నగారు నీ పెళ్లి నిశ్చయపరచేశారు. ఏమో! మూడు సంవత్సరాల అనంతరంమాట అప్పటి కేలాగుంటుందో!

అమ్మా! ముందే నాసలహా యెందుకు తీసుకోలేదు!

ఎందుకు నాయనా! మీ నాన్నగారు ఎరుగరా నీ మంచిచెడ్డలు!

ఆఖరికి చేసేదిలేక పెళ్లికి ఒప్పుకున్నాడు రమేశ్!

రమేశ్ ఆరాత్రి శయనాగారంలో చూచాడు తన నూతన వధుశీలని. పాపం ఆ శేష్రాయపుచిన్నారి. అతి అందంగావుంది; అయితేయేం? అకస్మాత్తుగా తాను భయకంపితుడై అచేతనుడైపోయాడు. అమ్మా! అని పిలిచాడు—జవాబు రాలేదు.

పిచ్చివాడిలా అరవ నారంభించాడు—సరోజ్!

కాదు, నేను "శీల"ని అంది పాపం ఆ నవవధు.

"శీల"వా, సరోజ్ వి కాదూ?

శీల ముఖం విషాదచ్ఛాయతో నిండివుంది. పెదవులు కంపిస్తున్నాయి.

రమేశ్ అన్నాడు—ఇందాక నా ఆరోగ్యం బాగులేక అలా అన్నాను.

శీలయేమీ అనలేకపోయింది; ఆమె కళ్ల వెంట కన్నీరు కార నారంభించింది.

* * *

రమేశ్ ఓవారం రోజులుపోయాక ఇంగ్లాండు వెళ్లిపోయాడు. కొన్నిరోజులుండి "శీల" పుట్టింటికి చక్కాబోయింది. కాలం గడచిపోతోంది. రమేశ్ ఉత్తరాలుకోసం నిరీక్షిస్తూ సరోజ్ అలసిపోయింది.

మాలతి జబ్బుపడి మంచమెక్కింది. సరోజ్ ని చూస్తూ గంటలకొలదీ ఆలోచిస్తూవుంది. నా భర్త అవసానకాలంలో రమేశ్ చాల సహాయంచేశాడు. పాపం ఆయన పోనేపోయారు. ఇప్పుడు నాదగ్గర రమేశ్ లేదుగదా! రమేశ్ కి వివాహం అయిపోయిందన్న ఓ గాలికబురు; మాలతి నిజమే అనుకుంది. సరోజ్ కి నమ్మకంలేదు; తన్ను యిలా అన్యాయం చేయడన్న నమ్మకం సరోజ్ కిమాత్రం నమ్మకంవుంది.

(తరువాయి 52-వ పేజీలో)